సాక్షి
ఒడిశా
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 5,15,964
బంగారం: 1 గ్రాము 720 మిల్లీ గ్రాములు
వెండి: 32 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



నేత్రపర్వంగా.. రుకుణ రథయాత్ర
పవిత్ర అశోకాష్టమి ఉత్సవంలో అంతర్భాగమైన రుకుణ రథయాత్ర శనివారం వైభవంగా ప్రారంభమైంది. - 8లో

శ్రీరామ నవమికి సన్నాహాలు
రాష్ట్రవ్యాప్తంగా శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



న్యూస్‌రీల్

రేపు ఢిల్లీ పర్యటనకు సీఎం మోహన్‌చరణ్



భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ మూడు రోజుల పర్యటన కోసం సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. దీంతో అదేరోజు సాయంత్రం కొంతమంది కేంద్ర మంత్రులను కలవనున్నారు. అనంతరం మంగళవారం ఢిల్లీ పెట్టుబడిదారుల సమ్మిట్‌లో పాల్గొనున్నారు. ఈ సమ్మిట్‌లో వ్యాపార దిగ్గజాలతో చర్చలు జరిపి ఒడిశాలో పెట్టుబడులకు సానుకూల అవకాశాల గురించి తెలియజేస్తారని సమాచారం. పారాదీప్‌లో నాఫ్తా క్రాకర్ ప్రాజెక్టు స్థాపన కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)తో అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం కూడా ఆయన ప్రయాణ ప్రణాళికలో ప్రధాన కార్యక్రమం కావడం విశేషం. తదుపరి ఈనెల 9వ తేదీన రాష్ట్రానికి తిరిగి వస్తారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి దాశరథి పట్నాయక్

జయపురం: జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణస్వీకారం చేసింది. ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది దాశరథి పట్నాయిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సరోజ్ దాస్, కార్యదర్శిగా సచితానంద మిశ్ర, ఉపాధ్యక్షుడిగా నవీన్ చంద్ర సాహు, కార్యదర్శిగా భోలానాథ్ పట్నాయక్, సహాయ కార్యదర్శిగా అంజన సింగ్, కోశాధికారిగా దేవ రామానుజం ప్రసాద్, గ్రంథాలయ కార్యదర్శిగా యుగల్ కిశోర్ పట్నాయక్, గ్రంథాలయ సహాయ కార్యదర్శిగా రక్షిభాయి, కార్యవర్గ సభ్యులుగా నళినీ కుమారి ఖెముండు, ప్రజ్ఞా కుమారి బెబర్త, తాపస పండ, తరణీ పాణిగ్రాహి, సచిన్ పాడి, ఆకాశ కులదీప్, పి.శంకరరావులు ప్రమాణ స్వీకారం చేశారు.

మద్యం దుకాణం బంద్ చేయాలి



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

రాయగడ: సదరు సమితి పరిధి పెంటా పంచాయతీ అమలాభట్ట కూడలిలో ఉన్న విదేశీ మద్యం దుకాణాన్ని శాశ్వతంగా బంద్ చేయాలని సర్పంచ్ ఎటల విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి మద్యం దుకాణం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సమయంలో దుకాణదారుడితో వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.

20 క్వింటాళ్ల విప్పపువ్వు స్వాధీనం



పోలీసులకు పట్టుబడిన నిందితుడు

రాయగడ: నాటుసారా తయారీకి వినియోగించే విప్పపువ్వును అక్రమంగా తరలిస్తుండగా కాసీపూర్ ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి కాసీపూర్ ఎక్సైజ్ శాఖ ఓఐసీ విష్ణుపద బెహర నేతృత్వంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, కలహండి వైపు వెళ్తున్న ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. దీంతో విప్పపువ్వు బస్తాలు పట్టుబడ్డాయి. దీంతో వ్యాన్ డ్రైవర్ సురేష్ నెమల్‌పూరిని అరెస్టు చేసి, వ్యాన్‌ను సీజ్ చేశారు. పట్టుబడిన విప్పపువ్వు విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని అంచనా వేశారు.

నేడు జగన్నాథుడి దర్శనం తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్: పవిత్ర శ్రీరామ నవమి పురస్కరించుకొని పూరీ శ్రీమందిరంలో జగన్నాథుడి దర్శనం ఆదివారం తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించారు. శ్రీమందిరంలో శ్రీరామ జనన ఉత్సవం ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మూలవిరాటుల సర్వ దర్శనం 5 గంటల పాటు తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని ఆలయ అధికార వర్గాలు తెలియజేశాయి. మధ్యాహ్న ధూపదీప, నైవేద్యం తర్వాత శ్రీరామ జన్మ ఉత్సవం కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఈ వ్యవధిలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సర్వ దర్శనం ఉండదని పేర్కొన్నారు.





నవీన్ పట్నాయక్‌కు ప్రతాప్ జెనా రాసిన లేఖ

బీజేడీలో వక్ఫ్ విభేదాలు

- సస్మిత్ పాత్రో ప్రకటనతో గందరగోళం
- చర్యలు తీసుకోవాలని సీనియర్ల డిమాండ్



సస్మిత్ పాత్రో



బద్రి నారాయణ పాత్రో



ప్రతాప్ జెనా



గణేశ్వర బెహరా

భువనేశ్వర్:

రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పురస్కరించుకొని బీజేడీలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ బిల్లుని పూర్తిగా వ్యతిరేకించాలని తీర్మానించిన బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్, చిట్టచివరి క్షణంలో నిర్ణయం మార్చుకున్నట్లు రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రో ఆకస్మికంగా ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో బిజూ జనతా దళ్ సలహా కమిటీ సభ్యులు పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌తో ప్రత్యక్షంగా సంప్రదించారు. అయితే దీనిపై నవీన్ స్పందిస్తూ.. ఎప్పటి మాదిరిగా ఈసారి కూడా పరిస్థితికి అనుగుణంగా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే ధ్యేయంగా వ్యవహరించామని స్పష్టం చేశారు. అయితే ఈ పరిస్థితుల్లో సస్మిత్ పాత్రో బిల్లుకు సానుకూలంగా ఓటు వేసినట్లు ప్రకటించడం వెనక ఆంతర్యం ఏంటని పార్టీ నాయకుల్లో సందిగ్ధతని నెలకొంది.

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

పార్లమెంట్‌లో బీజేడీ జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న సస్మిత్ పాత్రో వక్ఫ్ సవరణ బిల్లు ఓటింగ్ విషయంపై సరిగా వ్యవహరించలేదని బీజేడీ సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో అతడిపై అధిష్టానం తప్పకుండా క్రమశిక్షణ చర్యలు చేపట్టాల్సిందేనని ఒత్తిడి తెస్తున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి ప్రతాప్ జెనా అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు ఒక లేఖ రాశారు. సస్మిత్ పాత్రో దుందుడుకు చర్యపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని ప్రతిపాదించారు. పార్టీ విధానానికి వ్యతిరేకంగా ఆయన ప్రకటన చేయడం సరికాదని పేర్కొన్నారు.

దురదృష్టకరం: బద్రి నారాయణ పాత్రో

రాజ్యసభలో వక్ఫ్ బిల్లుపై చర్చ, ఆమోదం సందర్భంగా బీజేడీ అధికార ప్రతినిధి సస్మిత్ పాత్రో వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బద్రి నారాయణ పాత్రో ఆవేదన వ్యక్తం చేశారు. దళం మార్గదర్శకాలకు నీళ్లొదిలి అనవసరపు ప్రకటనలు చేశారని వ్యాఖ్యానించారు. పార్టీ క్రమశిక్షణకు అతీతంగా ఆయన నిర్ణయం బాహాటంగా ప్రకటించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనుక అదృశ్య శక్తి ఉందని అభిప్రాయపడ్డారు. ఎవరి ప్రేరణ, ప్రోద్బలంతో ఆయన ఈ సాహసానికి ఒడిగట్టారని నిలదీశారు. ఎవరి ఆదేశాల మేరకు ఇలా జరిగిందో దర్యాప్తులో తేలుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బాధ్యత వహించాలి: గణేశ్వర బెహరా

రాజ్యసభలో సస్మిత్ పాత్రో వ్యవహారం బిజూ జనతా దళ్‌ని సంక్షోభంలోకి నెట్టేసిందని ఆ పార్టీ ఎమ్మెల్యే గణేశ్వర్ బెహెరా మండిపడ్డారు. ఈ పరిణామానికి సస్మిత్ పాత్రో పూర్తి బాధ్యతగా వహించాలని పిలుపునిచ్చారు. వాస్తవానికి రాజ్యసభలో వక్ఫ్ బిల్లుని వ్యతిరేకిస్తామని ప్రకటించిన సస్మిత్ పాత్రో, మనస్సాక్షి ముసుగులో ఆకస్మికంగా నిర్ణయం మార్చుకుని సానుకూలంగా ఓటు వేసినట్లు ఎలా ప్రకటించారో అంతు చిక్కని పరిణామంగా పేర్కొన్నారు. 48 గంటల స్వల్ప నిడివిలో అతను మనస్సాక్షి ఆధారంగా పార్టీ వ్యతిరేక చర్యలకు ఎలా ధైర్యం చేయగలిగాడో నిగ్గు తేలాల్సి ఉందన్నారు.

త్వరలో స్పందిస్తాను: సస్మిత్ పాత్రో

వక్ఫ్ సవరణ బిల్లుపై బిజూ జనతా దళ్ శిబిరంలో పరిస్థితి అట్టుడికిపోతోంది. ప్రధానంగా ఈ బిల్లుకు సానుకూలంగా ఓటు వేసిన ఎంపీ సస్మిత్ పాత్రోకు వ్యతిరేకంగా శిబిరంలో ఘాటైన విమర్శలు దావానంలా విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితిపై ప్రధాన సూత్రధారి సస్మిత్ పాత్రో తీరికగా స్పందించనున్నారు. ఆయన ప్రస్తుతం తాష్కెంట్ పర్యటనలో ఉన్నారు. పార్లమెంటు ప్రతినిధులతో తాష్కెంట్‌కు వెళ్లారు. తాష్కెంట్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత వక్ఫ్ బిల్లు వ్యవహారంపై స్పందిస్తానని తెలియజేశారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని గోపబంధు ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాకాంత్ పట్నాయక్ అన్నారు. ఒడియా పక్షోత్సవాలు పురస్కరించుకొని జయపురం సమితి అంబాగుడలోని గోపబంధు ఐటీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం వలన క్షతగాత్రులకు సకాలంలో అవసరమైన రక్తం లభిస్తుందన్నారు. అలాగే తలసేమియా, సికిల్ సెల్, కాన్సర్ వ్యాధిగ్రస్తులకు రక్తనిల్వలు అవసరమని పేర్కొన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. శిబిరంలో 51 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఐటీఐ శిక్షకుడు పి.సతీష్ కుమార్, విష్ణు ప్రసాద్ భటి, రాజేష్ కుమార్ ప్రధాన్, యూత్ రెడ్‌క్రాస్ సలహాదారు నిరంజన్ పాణిగ్రాహి, ఒడిశా రక్త దాతల మహాసంఘం ప్రతినిధి ప్రమోద్ కుమార్ రౌలో, సతీష్ కుమార్, ఎస్‌కే పాడీ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



సీజ్ చేసిన సారా తయారీ సామగ్రి

జయపురం: సబ్ డివిజన్ కుంద్ర సమితి రాణిగుడ పంచాయతీ శివునిగుడ గ్రామ సమీపంలో ఇప్ప సారా తయారు చేస్తున్న బట్టీపై కుంద్ర పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఆ ప్రాంతంలో చట్ట విరుద్ధంగా నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో కుంద్ర పోలీసు అధికారి అశ్వినీ కుమార్ పట్నాయక్ నేతృత్వంలో పోలీసులు ఉదయం 7 గంటల సమయంలో దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా నాటుసారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన 2 వేల లీటర్ల ఇప్పఊటను ధ్వంసం చేశామని పోలీసు అధికారి పట్నాయక్ వెల్లడించారు. అలాగే 55 లీటర్ల ఇప్పసారాతో పాటు సారా వంటకానికి వినియోగించే సామగ్రిని సీజ్ చేశామని తెలిపారు. దీనిలో భాగంగా ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

చలివేంద్రాలు ఏర్పాటు



మార్కెట్ జంక్షన్ వద్ద చలివేంద్రం



హైస్కూల్ జంక్షన్ వద్ద చలివేంద్రం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో ఎండ తీవ్రత దృష్ట్యా మున్సిపల్ కౌన్సిల్ అధికారులు కూడళ్లలో చలివేంద్రాలు శనివారం ఏర్పాటు చేశారు. దీంతో కార్మికులు, బాటసారులు, స్థానికులకు ఉపశమనం లభిస్తోంది. పురపాలక స్వచ్ఛ సాథీలు చలివేంద్రాల వద్ద పనిచేస్తున్నారు.

దుస్తులు సాంప్రదాయానికి ప్రతీకలు



కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ శౌశ్య రెడ్డి తదితరులు

జయపురం: మనం ధరించే దుస్తులు సాంప్రదాయానికి ప్రతీకలని సబ్ కలెక్టర్, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి అక్కవరం శౌశ్య రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'అమొ పోషక అమొ పరిచయం' కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా పక్షోత్సవాలు నిర్వహిస్తోందని తెలియజేశారు. ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతుల పరిరక్షణ లక్ష్యంతో పక్షోత్సవాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మనం ధరించే సాంప్రదాయ వస్త్రాలు మన స్వాభిమానమని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కార్యనిర్వాహక అధికారి కతిబాస సాహు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు



డాన్స్ చేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని అగస్త్య ఫౌండేషన్ చైర్మన్ కేవీ సాయి చంద్రశేఖర్ సూచించారు. స్థానిక గజపతి స్టేడియం వద్ద శనివారం నిర్వహించిన సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి 2024–25 విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన విజయాలను తెలియజేశారు. అనంతరం జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్. రావు, రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, డైరక్టర్ డా.దుర్గాప్రసాద్ పాఢి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



బ్రజమోహన్ నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయగడ: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని పద్మపూర్ సమితి భామిని ప్రాంతంలోని ఐఆర్‌బీఎన్ బెటాలియన్ కమాండెంట్ బ్రజమోహన్ నాయక్ అన్నారు. పద్మపూర్‌లోని అభ్యాస్ టెక్నో పాఠశాల వార్షికోత్సవానికి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతోనే ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పద్మపూర్ తహసీల్దార్ శంకర్ బాగ్ మాట్లాడుతూ.. విద్యని వ్యాపారంగా కాకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యా సంస్థలను నిర్వహించాలని సూచించారు. విద్యతో పాటు ఇతర అంశాల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి లాడి తుకారం, ప్రిన్సిపాల్ దివ్య దేవాశిష్ దుబే తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పాఠశాల వార్షికోత్సవం పురస్కరించుకొని రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

కదంతొక్కిన గిరిజనులు



ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు



బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి చిత్రంగపల్లి పంచాయతీ ప్రజలు తమ హక్కుల కోసం కదంతొక్కారు. ఈ మేరకు సమితి కార్యాలయం వరకు బాణాలు చేతబట్టి శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీడీవో ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంవీ 72 గ్రామంలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడంపై న్యాయం చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులపై నియంత్రణ అవసరమన్నారు. అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని, తాగునీటి సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని వందలాది మంది గిరిజనులు పాల్గొన్నారు.

మినీ మారథాన్



మల్కన్‌గిరి: మారథాన్ ప్రారంభిస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: రన్నింగ్ చేస్తున్న చిన్నారులు



మల్కన్‌గిరి: రన్నింగ్‌లో పాల్గొన్న యువత



పర్లాకిమిడి: మినీ మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ జితేంద్రనాథ్ పండా తదితరులు

పర్లాకిమిడి: ఒడియా పక్షోత్సవాలు పురస్కరించుకొని జిల్లా క్రీడా, యువజన సర్వీసుల విభాగం ఆధ్వర్యంలో స్థానిక గుండిచా మందిరం నుంచి మినీ మారథాన్‌ను ఎస్పీ జితేంద్రనాథ్ పండా శనివారం ప్రారంభించారు. వివిధ కళాశాలల విద్యార్థులు మారథాన్‌లో పరుగులు తీశారు. బీఎన్ ప్యాలెస్ వద్ద కలెక్టర్ బిజయ కుమార్ దాస్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనుప్ పండా, అదనపు కార్యనిర్వాహణ అధికారి పృథ్వీరాజ్ మండల్, డిప్యూటీ కలెక్టర్, జిల్లా క్రీడాధికారి కమలకాంత పండా, జిల్లా పాఠశాలల క్రీడాధికారి సురేంద్ర పాత్రో తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: ఒడియా పక్షం పురస్కరించుకొని స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి మారథాన్‌ను శనివారం చేపట్టారు. కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు పాల్గొని పరుగులు తీశారు. కార్యక్రమంలో చైల్డ్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నారాయణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుదర్శన్ పట్నాయక్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు


శాండ్ మాస్టర్ అవార్డుతో సుదర్శన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన ప్రసిద్ధ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ ఈసారి బ్రిటిష్ శాండ్ మాస్టర్ అవార్డును గెలుచుకున్నారు. యూకేలోని వేమౌత్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సైకత కళా ఉత్సవం శాండ్ వరల్డ్ – 2025లో ఆయన ప్రతిష్ఠాత్మక ఫ్రెడ్ డారింగ్టన్ బ్రిటిష్ సాండ్ మాస్టర్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుని అందుకున్న తొలి భారతీయ సైకత శిల్పిగా నిలవడం విశేషం. ప్రపంచ శాంతి సందేశంతో రూపొందించిన 10 అడుగుల సైకత గణపతి శిల్పానికి ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.

బగ్గు సరోజినీ దేవి ఆస్పత్రికి ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు


మాట్లాడుతున్న డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కేంద్రంలోని బగ్గు సరోజినీ దేవి(బీఎస్‌డీ) ఆస్పత్రికి జాతీయ స్థాయిలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్ఏబీహెచ్) గుర్తింపు దక్కడం ఆనందంగా ఉందని డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు అన్నారు. ఇది దేశంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) కింద నమోదైన ఒక స్వయం ప్రతిపత్తి సంస్థ అని చెప్పారు. ఆస్పత్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాలు, అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను గుర్తింపు లభించిందన్నారు. 9 సూపర్‌స్పెషాలిటీ విభాగాలతో పాటు 12 డయాగ్నోస్టిక్స్ సేవలకు గుర్తింపు లభించిందన్నారు. శ్రీకాకుళం జిల్లా చరిత్రలో తొలిసారిగా ఈ గుర్తింపు పొందిన ఏకైక ఆసుపత్రిగా బీఎస్‌డీ అని పేర్కొన్నారు. నిరుపేదలు, సామాన్యులకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు.

‘ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిద్దాం’


టెక్కలిలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసి నాయకులు

టెక్కలి: అడవులను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ఆపరేషన్ కగార్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ కోరారు. శనివారం టెక్కలిలో మాట్లాడుతూ అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అడవులను కట్టబెట్టేందుకు మోదీ సర్కార్ పెద్ద కుట్రలు చేస్తున్నారని గుర్తు చేశారు. మావోయిస్టుల నుంచి అడవుల్ని విముక్తి చేసే పేరుతో పెద్ద కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రూ.లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను దోచుకునే ప్రయత్నమే ఆపరేషన్ కగార్ అని అన్నారు. దీని కోసం ఆదివాసీలను, మావోయిస్టులను హతమారుస్తున్నారని ప్రసాద్ ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను దేశ వ్యాప్తంగా వ్యతిరేకించాలని కోరారు. అలాగే ఈ నెల 13 ఆదివారం పలాసలో జరగనున్న కామ్రేడ్ పైల వాసుదేవరావు వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, జుత్తు వీరాస్వామి, గౌరకల బాలకృష్ణ, సార జగన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై కాంగ్రెస్ నిరసన


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: వక్ఫ్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం యావత్ ముస్లిం సమాజానికి వ్యతిరేకమని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లులో ఇతర మతస్థులు సభ్యులుగా ఉంటారని తెలియజేయడం శోచనీయమన్నారు. బీజేపీ ప్రభుత్వం మత స్వేచ్ఛను హరిస్తూ కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతోందని ధ్వజమెత్తారు. ఇది లౌకిక వాద సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదనరావు, డీసీ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ఎస్ ఈశ్వరి, సైదుల్లా ఖాన్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు అంబటి దాలినాయుడు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాన్ బాషా, నియోజకవర్గాల నాయకులు ఆబోతుల వెంకటనాయుడు, ఇజ్జురోతు రమణ, బొచ్చ వెంకటరమణ, మామిడి సత్యనారాయణ, కొత్తపల్లి రాంప్రసాద్, బాషా బాబు, సూరియా బేగం, చోడవరం లీలావతి, చోడవరం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా.. రుకుణ రథయాత్ర

- మౌసీ మా ఇంటికి లింగరాజు మహా ప్రభువు
- తరలివచ్చిన భక్తజనం
- పక్కాగా భద్రతా ఏర్పాట్లు


మారీచి జల కలశం వేలం



రుకుణ రథయాత్ర దృశ్యం

భువనేశ్వర్: పవిత్ర అశోకాష్టమి ఉత్సవంలో అంతర్భాగమైన రుకుణ రథయాత్ర శనివారం వైభవంగా ప్రారంభమైంది. దుర్గాదేవి, గోవింద స్వామితో కలిసి లింగరాజు మహా ప్రభువు మౌసీ మా (పిన్నమ్మ) దగ్గరకు ప్రయాణమయ్యాడు. దీనిలో భాగంగా రామేశ్వర ఆలయంలో కొలువుదీరి పూజాదులు అందుకోవడం ఆచారం. శనివారం ఉదయం 5 గంటలకు మంగళ హారతి, ప్రాతఃకాల ఆచారాలతో ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 5.30 గంటలకు భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. మూల విరాటుకు మహాస్నానం ముగించి అలంకరణ ఇత్యాది కార్యక్రమాలను ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు చేపట్టారు.

పటిష్టమైన భద్రత

రథయాత్ర సజావుగా సాగేందుకు కమిషనరేట్ పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భద్రతపై నిఘా కోసం సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసు అధికారులతో కూడిన పదహారు ప్లాటూన్ల పోలీసులను మోహరించారు. సమగ్ర భద్రతా కార్యకలాపాల్లో ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు (డీసీపీలు), ముగ్గురు అదనపు డీసీపీలు, 5 మంది సహాయ కమిషనర్లు (ఏసీపీలు), 12 మంది ఇన్‌స్పెక్టర్లు, 65 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. నగర డీసీపీ జగన్మోహన్ మీనా, ట్రాఫిక్ డీసీపీ తపస్ మహంతి భద్రత మరియు ట్రాఫిక్ ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

మారీచి జలానికి తగ్గిన గిరాఖీ

రుకుణ రథయాత్రలో మారీచి కుండం జలం ప్రత్యేకమైనది. సంతాన ప్రాప్తికి ఈ జలం అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని భక్తుల విశ్వాసం. ఏటా రుకుణ రథయాత్ర ముందు రోజు రాత్రిపూట ఈ జలాన్ని వేలం వేస్తారు. భక్తులు ఎగబాకి ఈ జలం కొనుగోలు చేసుకుంటారు. సంతాన ప్రాప్తి కోసం మారీచి కుండం జలం భగవంతుని ప్రసాదంగా భావిస్తారు. అయితే ఈ ఏడాది ఈ జలానికి గిరాఖీ గణనీయంగా దిగజారింది. ఏటా మాదిరిగా యాత్ర ముందు రోజు శుక్రవారం రాత్రి నిర్వహించిన వేలంలో పవిత్ర మారీచి జల కలశం ధర రూ.21,000లు పలికింది. రుకుణ రథ ప్రతిష్ఠ ఆచారాల తర్వాత శ్రీలింగరాజ ఆలయ సేవకుల బృందం బొడు నియోగులు ఈ వేలం పాటను నిర్వహించారు.

ట్రాఫిక్ నియంత్రణ

రుకుణ యాత్ర రద్దీ పురస్కరించుకుని పరిసరాల్లో వాహనాల రాకపోకలను కట్టుదిట్టంగా నియంత్రించారు. మౌసి మా కూడలి నుంచి రథ్ రోడ్డు మార్గంలో వాహనాల రవాణా నివారించారు. మ్యూజియం కూడలి, వివేకానంద మార్గం వైపు వాహనాలను మళ్లించారు. బారిక్ సాహి లేన్, మహరణ సాహి లేన్, గోసాగరేశ్వర్ కూడలి, శీతల్ షష్టి లేన్, తిని ముండియా కూడలి, హరచండి లేన్, మున్నా మెడికల్ లేన్, పున్నమ్మ గేట్ లేన్ వైపు నుంచి రథ్ రోడ్డు వైపు వాహనాల రాకపోకలను నివారించారు. రథ తయారీ ప్రాంగణం నుంచి వాహనాలను బట్టొ మహాదేవ్ ఆలయం వైపు మళ్లించి ట్రాఫిక్ నియంత్రించారు.

సొంతం చేసుకున్న కటక్ వాసులు

కటక్ జిల్లా దామోదర్‌పూర్ ప్రాంతానికి చెందిన జితేంద్ర మహరణ, జ్యోత్స్న రాణి మహరణ అనే జంట వేలంలో అత్యధిక ధరకు మారీచి జల కలశం సొంతం చేసుకున్నారు. అశోకాష్టమి నాడు పవిత్ర జలంలో స్నానం చేయడం వల్ల నిస్సంతాన స్త్రీకి సంతానం ప్రాప్తిస్తుందని నమ్ముతారు. హిందూ గ్రంథాల ప్రకారం శివుడు ఆ ప్రదేశంలోనే మారీచ అనే రాక్షసుడిని సంహరించాడు. అయితే తన భర్త లేకుండా తాను ఎలా తల్లి కాగలనని రాక్షసుడి భార్య భగవంతుడిని అర్థించింది. ఆమె ప్రార్థనకు సంతసించిన భగవంతుడు ఆమెకు ఒక వరం ఇచ్చాడు. తన భర్త మారీచి హతమైన ప్రాంతంలోని జలాశయం నీటిలో స్నానం చేసి మాతృత్వాన్ని పొందేందుకు వరం ప్రసాదించాడు. అప్పటినుంచి ఈ జలాశయం మారీచి కుండంగా ప్రాచుర్యం పొందినట్లు పౌరాణిక కథనం ప్రచారంలో ఉంది. 2022 సంవత్సరంలో స్థానిక బరముండా ప్రాంతానికి చెందిన ఒక జంట రూ.1.30 లక్షలు చెల్లించి పవిత్ర మారీచి జల కలశం సొంతం చేసుకోవడం గమనార్హం. అలాగే పిల్లలు లేని మరో జంట 2013 సంవత్సరంలో రూ.2 లక్షలతో వేలం పాడి నీటిని చేజిక్కించుకుంది. 2015 సంవత్సరంలో సంతానం కోసం మరో జంట రూ.41,000కి మారీచి కుండ జలం దక్కించుకుంది. క్రమంగా మారీచి కుండం జలం పట్ల గిరాకీ దిగజారుతోంది. 2023 సంవత్సరంలో రూ.30,000, 2024 సంవత్సరంలో రూ. 24,500కి మారీచి జలం ధర పరిమితం అయింది. ఈ ఏడాది మరింత దిగజారి రూ.21,000 మాత్రమే పలికింది.

శ్రీరామ నవమికి సన్నాహాలు


జయపురం: జమాల్ లైన్‌లో కొలువుదీరిన సీతారాములు


జయపురం: పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రాయగడ: శ్రీరామ నవమి ఉత్సవాలకు పట్టణం సన్నద్ధమైంది. బజరంగ్ దళ్, శ్రీరామ ఉత్సవ కమిటీలు ఉత్సవాల కోసం పట్టణంలో తోరణాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక జగన్నాథ మందిరం కూడలి నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా స్థానిక బ్రహ్మణ వీధి కూడలిలో కోదండ రామ మందిరం శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబవుతోంది.

జయపురం: పట్టణంలో శ్రీరామ నవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీల సభ్యులు తెలియజేశారు. పట్టణంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కశ్యప్, అదనపు ఎస్పీ మనోజ్ పూజారి, పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్ తదితరులు పాల్గొన్నారు.


రాయగడ: ముస్తాబైన రామ మందిరం


రాయగడ: పట్టణంలో శ్రీరామ నవమి సందడి

సిద్ధిదాత్రిగా జగులైమాత దర్శనం


అమ్మవారి ఉత్సవంలో చిన్నారులు

భువనేశ్వర్: జట్నీ మున్సిపాలిటీ కుదియయారి గ్రామ దేవత జగులైమాత వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవా ల్లో తొమ్మిదో రోజు ఉదయం సూర్యపూజ అనంతరం అమ్మవారు నగర పరిక్రమలో భాగంగా గ్రామంలోని అన్ని దేవతలను కలిసిన తర్వాత పెద్ద అక్క దేవస్థానం సందర్శించింది. రోజంతా భక్తుల పూజలు అందుకుంది. సాయంత్రం వేళలో సొంత ఆలయానికి తిరిగి చేరింది. స్వస్థానంలో మహాస్నానం జరిగిన తర్వాత జగులైమాత సిద్ధిదాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. షోడశోపచా ర పూజలు, సప్తసతీ చండీ ఆహుతి వంటి ప్రత్యేక పూజాదులతో ఉత్సవ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణతో చిన్నారులు కుమారి పూజ ఉత్సవంలో భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు.


సిద్ధిదాత్రి అలంకరణలో జగులైమాత

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గార: అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో కుటుంబానికి భారమవుతున్నానని భావించి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గార మండలం అంపోలులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంపోలు గ్రామం దమ్మలవీధికి చెందిన పొదిలాపు రమణ (57) తాపీ పనులు చేస్తుండేవాడు. కొన్ని రోజులుగా ఆస్తమా, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. వ్యాధిని భరించలేక ఈ నెల ఒకటో తేదీన పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. రమణకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ

రాయగడ: సదరు సమితి పరిధిలోని కొత్తపేటలో సమారు రూ.50 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ, గోపూజ, చతుర్వేద పారాయణ, హోమ పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరఘట్టం నుంచి వచ్చిన ఎస్‌వీఎల్ఎస్ శర్మ బృందం ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వి.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

జీతాలివ్వకపోతే.. మేమెలా బతకాలి?

- అరసవల్లి ఆదిత్యాలయంలో దినసరి వేతనదారుల ఆవేదన
- విధులు బహిష్కరించిన 48 మంది సిబ్బంది
- ప్రసాదాల తయారీ, విక్రయాలు, అన్నదానం నిలిపివేత
- నెలాఖరు వరకు గడువు కోరిన ఈవో భద్రాజీ


మూతపడిన ప్రసాదాల కౌంటర్

ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం 6 గంటలకే సర్వదర్శనాల కోసం గుడి తలుపులు తెరుచుకున్నాయి.. వందలాది భక్తులు దర్శనాలకు వచ్చేసారు. కానీ ఆలయం ముందు చెత్తాచెదారాలు తొలిగించలేదు.. ప్రసాదాల కౌంటర్లు తెరవలేదు..ఉచిత ప్రసాదంతో పాటు లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీ జరగలేదు.. పంపిణీ నిలిచిపోయింది..అసలేం జరుగుతుందో తెలియక అధికారులు అయోమయానికి గురయ్యారు. ఆలయంలో ఎన్నాళ్ల నుంచో పనిచేస్తున్న 48 మంది దినసరి వేతనదారులంతా తమకు రావాల్సిన పెండింగ్ జీతాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూనే.. ఆలయ విధులకు హాజరుకాకుండా నిరసనకు దిగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. దర్శనాలు చేసుకుని తిరిగి వస్తున్న భక్తులకు ప్రసాదాలు లేవనే సమాధానం చెబుతుంటే.. ఆదిత్యాలయానికి ఏమయ్యిందనే ప్రశ్నలు భక్తుల నుంచి వ్యక్తమయ్యాయి. ఇలా ఎన్నడూ జరగలేదని భక్తులు మండిపడ్డారు.


ఈవో కార్యాలయం వద్ద బైఠాయించిన దినసరి వేతనదారులు

అరసవల్లి:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న తరుణంలో శనివారం దినసరి వేతనదారులు విధులు బహిష్కరించారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈవో వై.భద్రాజీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఇంతవరకు జీతాలు ఇస్తామంటూ కాలయాపన చేశారని.. వారం రోజులుగా విజయవాడ వెళ్లి కూడా తమ సమస్యకు పరిష్కారం చూపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా చాలాసార్లు ఈవో చెప్పారని, ఎమ్మెల్యే చెప్పారని ఊరుకున్నామని.. ఆఖరికి మంత్రి కూడా భరోసా ఇచ్చినా తమ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పటికే ఆర్థికంగా ఎంతో నష్టపోయామని, కుటుంబాలతో నెట్టుకురావడం కష్టమైపోయిందని..ఇకనైనా తమకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆలయ పారిశుద్ధ్యం, అన్నదాన వంట, ప్రసాదాల తయారి తదితర కీలక విభాగాలతో పాటు టికెట్ల విరాళాలు, ఆర్జిత సేవల టికెట్ కౌంటర్ల విధులకు దినసరి వేతనదారులెవ్వరూ వెళ్లకుండా నిరసనను కొనసాగించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే..

గత ప్రభుత్వం ఉన్నంతవరకు అరసవల్లి ఆలయంలో దినసరి వేతనదారులు ఎప్పటికప్పుడు జీతాలను అందుకునే వారు. రెగ్యులర్ నియామకాలు లేకపోవడంతో దినసరి వేతనదారులే అన్ని పనులకు కీలకంగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడ పనిచేస్తున్న 48 మందిపై వేటు వేస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు. మంత్రి అచ్చెన్నాయుడు అయితే జిల్లా కలెక్టర్, కీలక అధికారుల సమక్షంలో వీరిని తొలిగించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అలా వీరంతా రోడ్డున పడ్డారు. అప్పటి వరకు వస్తాయనుకున్న పెండింగ్ జీతాలు నిలుపుదల చేశారు. తర్వాత రథసప్తమి ఉత్సవాల సందర్భంగా బాధితులంతా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్‌లను వేడుకున్నప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఏదో ఒక రూపంలో తమ నిరసనను కొనసాగిస్తామంటూ కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు వేతనదారులు ‘సాక్షి’ వద్ద స్పష్టం చేశారు.

ఈవో చర్చలు..

రెగ్యులర్ సిబ్బంది మినహా మిగిలిన దినసరి వేతనదారులంతా నిరసనకు దిగడం సంచలనంగా మారింది. దీంతో హుటాహుటిన ఆలయానికి వచ్చిన ఈఓ భద్రాజీ.. దినసరి వేతనదారులను పిలిపించి చర్చించారు. వార్షిక కల్యాణ మహోత్సవాలు జరుగుతున్న వేళ ప్రసాదాలు తయారీ, అన్నదానాన్ని ఆపేసి నిరసనలకు దిగడమేంటని ప్రశ్నించారు. పెండింగ్ జీతాల అంశం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ వద్ద ప్రస్తావించామని, ఈ నెలాఖరు వరకు నిరసనలు చెయ్యొద్దని..తర్వాత మీ ఇష్టమని స్పష్టం చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాలు జరుగుతున్న తరుణంలో ఇలా భక్తులకు ఇబ్బందులు పెట్టొద్దని, ఉన్నతాధికారులు ఈనెలాఖరులోగా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముందని..అంతవరకు సహకరించాలని కోరారు. అయినప్పటికీ దినసరి వేతనదారులు ఎలాంటి స్పందనను తెలియజేయకుండానే వెనుదిరిగారు. తమ సమస్యలపై ఎప్పుడు అడిగినా ఇలాగే చెబుతున్నారని, తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


వేతనదారులతో చర్చిస్తున్న ఈవో భద్రాజీ, పక్కనే శంకరశర్మ

ప్రసాదాల్లేవ్.. అన్నదానం లేదు..

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎంతో ఇష్టమైనవి పులిహోర, లడ్డూ ప్రసాదాలే. మధ్యాహ్నం భక్తదాతలిచ్చిన విరాళాలతో నిర్వహించే అన్నదాన ప్రసాదానికి సైతం తాకిడి అధికంగానే ఉంటుంది. వీటిని తయారుచేస్తున్న వారిలో 99 శాతం మంది దినసరి వేతనదారులే. వీరంతా శనివారం నిరసనకు దిగడంతో ఉదయం నుంచి వంట మొదలు పెట్టలేదు. పులిహోర సిద్ధం చేయలేదు. ఉదయం 6 గంటల నుంచే అమ్మకాలు ప్రారంభం కావాల్సిన ప్రసాదాల కౌంటర్‌కు తాళాలు పడ్డాయి. నిత్యం పంపిణీ చేసే ఉచిత ప్రసాదాలు నిలిపివేశారు. అన్నదాన ప్రసాదం తయారిపై కూడా మధ్యాహ్నం 11 గంటల వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.ఆ తర్వాత ఈవో భద్రాజీ, విభాగ బాధ్యుడు కె.వి.రమణమూర్తిల విజ్ఞప్తి మేరకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన 100 మంది భక్తులకు అన్నదాన ప్రసాదాలు అందేలా దినసరి వేతనదారులే వంటను పూర్తి చేసి భోగం పెట్టించిన అనంతరం భక్తులకు వడ్డించారు. అరసవల్లి ఆలయ చరిత్రలో ఇంతవరకు ఇలాంటి పరిస్థితి రాలేదు. ప్రసాదాలు లేని రోజులు రావడం.. ఇదే తొలిసారి అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

గ్రూప్ - 2 ఫలితాల్లో శ్రీనివాస్ సత్తా


సుంకర శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ - 2 మెయిన్ ఫలితాల్లో మండలంలోని సుంకరిపేటకు చెందిన మాజీ వాయుసేనాని సుంకర శ్రీనివాస్ సత్తా చాటారు. 2004 నుంచి 20 సంవత్సరాల పాటు ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మన్‌గా సేవలు అందించి 2024 జనవరిలో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ.. గత నెలలో విడుదలైన ఎస్ఎస్‌సీ సీజీఎల్ పోటీ పరీక్షలో జీఎస్టీ అండ్ కస్టమ్స్ శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. అయితే గ్రూప్ - 2 ఫలితాల్లో విజేతగా నిలవడంతో ఈ పోస్టులోనే జాయిన్ అవుతానని శ్రీనివాస్ తెలిపాడు.

యువకుడి అదృశ్యం


చింతల కిశోర్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని జోకిశీల గ్రామానికి చెందిన చింతల కిశోర్ అనే యువకుడు ఈ నెల 1వ తేదీ నుంచి కనిపించడం లేదు. అతని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి తెలిపారు. ఖాళీగా ఉంటున్న నేపథ్యంలో తల్లిదండ్రులు కిశోర్‌ను మందలించారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా

• పది మందికి గాయాలు


తీవ్రంగా గాయపడిన లక్ష్మన్నాయుడు

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి తలకు గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పక్కి గ్రామంలో ఒకరు మృతి చెందగా.. కొండదేవుపల్లి గ్రామానికి చెందిన బంధువులు పరామర్శకు ఆటోలో బయలుదేరారు. సరిగ్గా కమ్మవలస వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా పడడంతో అందులో ఉన్న పదిమందికీ గాయాలయ్యాయి. వెంటనే వీరిని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా.. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. వీరిలో బి.పారినాయుడు, లక్ష్మన్నాయుడు తలలకు గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను ఎమ్మెల్యే బేబినాయన, డీఎస్పీ భవ్యారెడ్డి, తదితరులు పరామర్శించారు.

మద్యం సీసాల పట్టివేత

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటిలో 65 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యు. మహేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం గ్రామంలో తనిఖీలు చేపడుతుండగా.. మహేష్ ఇంటిలో మద్యం బాటిళ్లు దొరికాయి. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో సిబ్బంది తాళ్లపూడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల శాల కూలి ఆవు మృతి


మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న వీఆర్‌ఓ రాజేంద్ర, గ్రామస్తులు

వీరఘట్టం: మండలంలోని దశుమంతపురం గ్రామంలో పశువుల శాల కూలి ఆవు మృతి చెందింది. శుక్రవారం రాత్రి భారీగా కురిసిన వర్షానికి కెంగువ గణేష్‌కు చెందిన పశువుల శాల కూలిపోయింది. ఆ సమయంలో శాలలో రెండు ఆవులు, రెండు దూడలుండగా.. ఒక ఆవు, రెండు దూడలు తప్పించుకున్నాయి. ఒక ఆవు మాత్రం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ రాజేంద్ర శనివారం గ్రామానికి చేరుకుని పశువుల శాల, ఆవు కళేబరాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని చెప్పారు. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పిడుగుపాటుకు మరో ఆవు..


మృతి చెందిన ఆవు

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి పంచాయతీ శివారు కొత్తూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం పిడుగు పడడంతో పి. సత్యనారాయణకు చెందిన ఆవు మృతి చెందింది. ఇంటి సమీపంలోని కళ్లంలో ఆవును కట్టగా.. ఒక్కసారిగా పిడుగు పడడంతో తమ జీవనాధారమైన ఆవు మృతి చెందిందని సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

కొత్త ఆలోచనలు.. సరికొత్త ఆవిష్కరణలు..

• 15 గంటల్లో బైక్ తయారీ చేసిన గౌతమ్
• బ్యాటరీలతో సరికొత్త వాహనాలు డిజైన్
• స్టీరింగ్ లేని కారు, వ్యవసాయానికి ఉపయోగపడే స్ప్రేయర్లు కూడా..


ఈ-బైక్‌లు తయారు చేస్తున్న గౌతమ్


ఉగాది పురష్కారాల్లో గౌతమ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


తాను తయారు చూసిన వాహనంపై కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌తో గౌతమ్


బ్యాటరీతో తయారు చేసిన స్కూటర్


బ్యాటరీతో నడిచేలా తయారు చేసిన బైక్

పార్వతీపురం టౌన్:

పట్టణానికి చెందిన గెంబలి గౌతమ్ విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో డేటా సైన్స్ విద్యను పూర్తి చేశాడు. చూసే ప్రతి కళా ఒడిసి పట్టడమంటే చిన్నప్పటి నుంచి సరదా. అదే అలవాటుగా మారి.. నూతన ఆవిష్కరణలకు బీజం పోసింది. మైక్రో ఆర్ట్ నుంచి వినూత్న వాహనాల తయారీ వరకూ కొత్త ఆలోచనలతో సాగిపోతున్నాడు. రోజురోజుకూ పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో బ్యాటరీతో నడిచే వాహనాలను సొంతంగా తయారు చేసి అందరి మన్ననలను పొందుతున్నాడు. కళాత్మక ఆలోచన నుంచి రూపుదిద్దుకున్న ఆవిష్కరణలను చూసి ఔరా అని అనాల్సిందే. అతి తక్కువ ఖర్చుతో నడిచే స్కూటర్‌ను చూస్తే వావ్ అనాల్సిందే. విభిన్నమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్న గౌతమ్ ఆలోచనలను ఒక్కసారి పరిశీలిస్తే..

దివ్యాంగులకు స్టీరింగ్ లేని కారు..

దివ్యాంగుల కోసం దేశంలోనే మొట్టమొదటి స్టీరింగ్ లెస్ కారుని తయారు చేసి దాన్ని రోడ్లపై నడుపుతూ గౌతమ్ అబ్బురపరిచాడు. ఈయన రూపొందించిన కారుకి స్టీరింగ్ ఉండదు. కేవలం రూ.32 వేల ఖర్చుతో డిజైన్ చేసిన కారులో 350 వోల్టుల సామర్థ్యం కలిగిన 2 మోటార్లు, లిథియం బ్యాటరీ, కొంత ఐరన్ వినియోగించాడు. సోలార్‌తో పాటు బ్యాటరీతో నడిచేలా కారుని తయారు చేశాడు. కాళ్ల వద్ద ఏర్పాటు చేసిన సెన్సార్ల ద్వారా ఆపరేట్ అవుతుంది. చేతులు లేని విభిన్న ప్రతిభావంతుల్ని దృష్టిలో పెట్టుకొని ఈ డిజైన్ రూపొందించారు. జీపీఆర్ఎస్ సిస్టమ్, బ్లూ టూత్ వంటి సదుపాయాలూ ఈ కారు సొంతం. దీనికి లైసెన్స్‌తో పనిలేదు. గతంలో అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ కారుని చూసిన జపాన్ బృందం నుంచి గౌతమ్ ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. విశాఖపట్నంలోని ఇద్దరు దివ్యాంగులకు రెండు కార్లు ప్రత్యేకంగా తయారు చేసి వారికి అందజేశారు.

కొత్త ఆవిష్కరణలు..

పెట్రోల్ ధరలు భారీ స్థాయిలో పెరుగుతున్నాయి. దీనివల్ల సాధారణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారి సమస్యలకు పరిష్కారాన్ని చూపించేలా సరికొత్త డివైజ్‌లు రూపొందించాడు గౌతమ్. చైనాకు చెందిన హబ్ మోటారు వినియోగించి, బైక్‌లో కొన్ని మార్పులను చేసి లీటర్ పెట్రోల్ గతంలో ఇచ్చిన మైలేజ్ కంటే డబుల్ వచ్చేలా చేశాడు. ఇప్పటికే ప్రాక్టికల్‌గా పరీక్షించిన గౌతమ్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాడు.

తక్కువ ఖర్చుతోనే స్కూటర్..

ఇంట్లో ఉండే పాత ఇనుప సామగ్రిని వినియోగించి కేవలం రూ.13 వేల ఖర్చుతో రెయిన్ బో స్కూటర్‌ను గౌతమ్ రూపొందించాడు. లిథియం బ్యాటరీ, మూలకు చేరిన కొన్ని వాహనాల పరికరాలను వినియోగించి దీనిని తయారు చేశాడు. తన మామయ్య కోరిక మేరకు దీనిని తీర్చిదిద్దానని, అయితే ఎంతోమందికి నచ్చడంతో ఈ తరహా బైక్స్ తయారు చేయాలంటూ ఆర్డర్లు వస్తున్నాయని గౌతమ్ చెబుతున్నాడు.

ఈ-బైక్ తయారీలో

తన స్నేహితుడైన వెల్డర్ జానకి సహాయంతో కేవలం 15 గంటల్లో ఈ-బైక్ రూపొందించాడు. దానిని రెండు గంటలపాటు చార్జింగ్ చేస్తే 50 నుంచి 60 కిలోమీటర్ల స్పీడ్‌తో 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. వాహనం తయారీకి పాత ఇనుప సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు, స్కూటీ టైర్లు, బీఎల్‌డీసీ మోటార్, లిథియం బ్యాటరీని వినియోగించాడు. యాక్సిలేటర్, ఆటో గేర్ సిస్టమ్, హ్యాండ్ బ్రేక్ ఉపయోగించాడు. రాత్రి కూడా సునాయాసంగా ప్రయాణించేందుకు వీలుగా బైక్‌కు ఫ్లడ్‌లైట్ అమర్చాడు. పట్టణానికిచెందిన ఓ వ్యాపారి ఎలక్ట్రికల్ పరికరాలు ఉచితంగా ఇవ్వడంతో తన ప్రయోగం వేగంగా 15 గంటలో పూర్తి చేయడం విశేషం.

సత్కారం..

జిల్లాకు చెందిన గౌతమ్ నూతన ఆవిష్కరణలతో ముందుకు వెళ్తూ యువ శాస్త్రవేత్తగా జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. ఇటీవల ఉగాది పురస్కారం అందజేసి సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టి అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఏ ఆలోచన వచ్చినా..



ఏ ఆలోచన వచ్చినా వెంటనే అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంటాను. ఇప్పటివరకూ స్టీరింగ్ లెస్ కారుతో పాటు రెయిన్ బో స్కూటర్, రెండింతల మైలేజీ వచ్చేలా బైక్ డిజైన్‌లో మార్పులు చేశాను. సరికొత్త బైక్ తయారీకి ప్రయత్నిస్తున్నాను. రెయిన్ బో స్కూటర్ చాలా మందికి నచ్చడంతో ఇప్పటికే కొంతమందికి డిజైన్‌చేసి అందజేశాను. చిన్నప్పటినుంచి సరికొత్తగా ఆలోచించడం, ఏదో ఒకటి చేయాలన్న తపనతో అనేక విషయాలను నేర్చుకోవడం మొదలు పెట్టాను.

– జి.గౌతమ్, యువకుడు, పార్వతీపురం.

ఏపీటీఎస్‌ఏ నూతన కమిటీ ఏకగ్రీవం


నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ (ఏపీటీఎస్‌ఏ) ఉమ్మడి విజయనగరం జిల్లా శాఖ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా డి.నవీన్‌చంద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.సురేష్‌కుమార్, జిల్లా సెక్రటరీగా కేవీఎస్ఎస్ సింధూర, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.దివ్యభారతి, పి.సంతోష్‌కుమార్, వై.కామినాయుడు, బీవీఎస్ఎం నాయుడు, జాయింట్ సెక్రటరీలుగా వి.సరస్వతమ్మ, టి.అనిల్, ఎస్.రంజిత్‌కుమార్, ట్రెజరర్‌గా జి.ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పి.కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్.భాస్కర్, ఎలక్షన్ పరిశీలకుడిగా డి.రమణరెడ్డి వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, జి.నారాయణ, నాయుడు జగన్నాథం, కామరాజు, సత్యంనాయుడు, ఏపీఎన్‌జీఓ జిల్లా, పట్టణ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌బాబు, సురేష్, వై.ఆనంద్‌కుమార్, కనకరాజు, కోశాధికారి ఎస్‌వీ సుధాకర్, శ్రీకాకుళం, విశాఖపట్నం , తూర్పుగోదావరి, పార్వతీపురం జిల్లాల నుంచి ట్రెజరీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీకి పరిశోధనా ప్రాజెక్ట్

• వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి


ప్రాజెక్టు నమూనాను అందుకుంటున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బయోటెక్నాలజీ విభాగానికి రూ.4 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్ట్ మంజూరైంది. శనివారం స్థానిక యూనివర్సిటీ క్యాంపస్‌లో వీసీ టీవీ కట్టిమణి విలేకరులతో మాట్లాడుతూ.. 'గిరిజనులలో సికిల్‌సెల్ ఎనీమియా' అనే ఆరోగ్య సమస్యపై పరిశోధన చేయడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవికి అప్పగించిందని తెలిపారు. ఆదివాసీలు అధికంగా ఉన్న ఆరు రాష్ట్రాలలో సికిల్ సెల్ వ్యాధి నివారణకు రూ.4 కోట్ల వంతున మంజూరు చేయనున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి చేపడుతున్నారని చెప్పారు. తాజాగా యూనివర్సిటీ తరఫున వచ్చిన ఈ పరిశోధనా మిషన్‌లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆదివాసులపై పరిశోధనలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కర్రల మిషన్‌లో పడి మహిళ మృతి

• కేసు నమోదు చేసిన పోలీసులు


సంఘటనా స్థలంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు


మృతురాలు జ్యోతి

గంట్యాడ: పని చేస్తున్న కర్రల మిషనే ఆమె పాలిట యమపాశమైంది. ప్రమాదవశాత్తూ మిషన్‌లో పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తమతో పనిచేసిన మహిళ క్షణాల్లోనే మృతి చెందడంతో సహచర కూలీలు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్కిడాం గ్రామానికి చెందిన అసకపల్లి జ్యోతి అనే మహిళ, అదే గ్రామానికి చెందిన కొంతమంది మహిళలతో కలిసి సిరిపురం సచివాలయం ఎదురుగా ఉన్న నీలగిరి కర్రల డిపోలో పనికి వచ్చింది. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం నీలగిరి కర్రలను మిషన్‌లో వేస్తుండగా చీర కొంగు మిషన్‌లోకి చిక్కుకు పోవడంతో ఒక్కసారిగా మిషన్‌లో పడిపోయింది. దీంతో ఆమె అక్కడక్కడే మృతి చెందింది. మృతిరాలికి భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు. భర్త ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడడంతో ఒకరి మృతి

• మరో నలుగురికి గాయాలు


వైద్యసిబ్బందితో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

సీతంపేట: మండలంలోని ఇసుకగెడ్డ వద్ద ఆటో బోల్తాపడిన సంఘటనలో పాలకొండ మండలం వెలగవాడకు చెందిన జి.లక్ష్మణరావు(38) అనే వ్యక్తి మృతి చెందగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేట నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఆటో ఇసుకగెడ్డ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మణరావు అపస్మారక స్థితికి చేరుకోగా.. మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్య సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం వల్లే లక్ష్మణరావు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మృతుడికి భార్య మేరీ, ఇద్దరు ఆడపిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు.

13 ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు


టీటీడీ నుంచి వచ్చిన కంకణాలు, తదితర పూజా సామాగ్రిని అర్చకులు అందజేస్తున్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 13 ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక టీటీడీ కార్యాలయంలో టీటీడీ నుంచి వచ్చిన కంకణాలు, పుసుపు, కుంకుమ, గోవిందనామాలను అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీటీడీ సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉభయ జిల్లాల్లో నిర్మించిన 13 ఆలయాల్లో ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ ప్రసాద్‌భవానీ, అర్చకుడు పీవీ నరసింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

• పోక్సో కేసు నమోదు


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఐదేళ్ల వయస్సుగల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన బాలుడి (15)పై పోక్సో కేసు నమోదు చేసినట్లు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో చిన్నారి ఆడుకుంటుండగా బాలుడు వారి ఇంటికి వెళ్లాడు. చిన్నారి తల్లి ఇంటి వెనుక భాగంలో వంట చేసుకుంటుండగా బాలికను ఇంటిలోని మంచంపైకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నాడు. చిన్నారి ఏడుస్తూ తల్లిదగ్గరికి వెళ్లి చెప్పే ప్రయత్నం చేసింది. బాలికను పూర్తిగా పరిశీలించగా రక్తం చారలు ఉండడంతో అత్యాచారయత్నం జరిగినట్లు గుర్తించి ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. బాలుడిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. తహసీల్దార్ ప్రసాదరావు, సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐలు సీహెచ్ నవీన్‌పడాల్, బి.దేవి బాలిక తల్లి స్టేట్‌మెంట్‌ను రికార్డుచేశారు.

'తపస్సుకాల ఉపవాస ప్రార్థనలు'

తెర్లాం: స్థానిక ఆర్సీఎం చర్చిలో తపస్సుకాల ఉపవాస ప్రార్థనలు శనివారం భక్తిశ్రద్ధలతో చేశారు. ఫాదర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫాదర్ దూసి దేవరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఏసుప్రభువు సందేశాన్ని వినిపించారు. సర్వమానవాళి పాప పరిహారానికి ఏసుక్రీస్తు శిలువలో ప్రాణత్యాగం చేశారని, ఆయన బోధనలు అనుసరణీయమన్నారు. ప్రపంచ శాంతి కోసం మనమంతా సోదరభావంతో మెలగాలని తెలిపారు.

కథలు అభ్యుదయ భావాలకు ప్రతీకలు

• ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవిజీ శంకరరావు


స్వీయ రచనల పుస్తకాలను అందజేస్తున్న రచయితలు

విజయనగరం అర్బన్: ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు కథలు అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలవడంతో పాటు యువ కథకులకు మార్గనిర్దేశం చేస్తాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజి శంకరరావు అన్నారు. విజయనగరంలోని చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో అట్టాడ అప్పలనాయుడు తాను రాసిన నక్షత్రబాట కథా సంపుటిని డీవీజీ శంకరరావుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర కథలు, సామాజిక పరిస్థితులపై అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరినాయుడుతో చర్చించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. విజయనగరం సాహితీ చరిత్రలో కథలకు ఎంతో ప్రాధాన్యముందన్నారు. అప్పలనాయుడు, గౌరినాయుడు వంటి కథా రచయితలు ఎంతో మంది యువ కథకులకు స్ఫూర్తిగా నిలవడం గొప్ప విషయమన్నారు.

జిల్లా వాసులకు అరకు కాఫీ రుచులు

• ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ


అరకు కాఫీపై సిబ్బందితో చర్చిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: జిల్లా వాసులకు అరకు కాఫీ రుచులు అందుబాటులోకి తేసుకురానున్నట్లు పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. పట్టణంలోని ఐటీడీఏ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అరకు కాఫీకి మంచి గుర్తింపు ఉందన్నారు. అరకు కాఫీని అన్ని ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతో ఇటీవల పార్లమెంట్, శాసనసభలలో అవుట్‌లెట్స్ ప్రారంభించారన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గతంలోనే పెట్రోల్‌బంక్ వద్ద అరకు కాఫీని ప్రారంభించినప్పటికీ.. అనివార్య కారణాల వల్ల మూసివేయాల్సి వచ్చిందన్నారు. దీన్ని మరలా తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈయనతో పాటు ఏపీఓ ఎ.మురళీధర్, సహాయ గణాంకాధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలు చూపిస్తున్న ఎస్ఐ సాగర్‌బాబు

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యంసీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి గ్రామంలో మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మద్యంసీసాలు పట్టుకుని, వాటిని అమ్ముతున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు.

వేడుకగా 'గురు వందనం'


ద్వారం దుర్గాప్రసాద్‌కు గురువందన సత్కారం చేస్తున్న శిష్యప్రశిష్య సమాఖ్య ప్రతినిధులు, అతిథులు

విజయనగరం టౌన్: కేంద్ర సాహిత్య నాటక అకాడమీ పురస్కార గ్రహీత, మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల పూర్వ అధ్యాపకుడు, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావును శిష్యప్రశిష్య సమాఖ్య శనివారం గురువందనం పేరుతో సత్కరించింది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడిన శిష్యులందరూ కలిసి సంగీత కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందు ప్రముఖ విద్వాంసులు ద్వారం సత్యనారాయణరావు నిర్వహించిన వయోలిన్ కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. విశాఖ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ గౌరవ కార్యదర్శి రామదాస రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండా సుధారాణి, కట్టమూరి చంద్రశేఖరం, కేవీఎల్ ఎస్.శాస్త్రి, చాగంటి కొండలరావు, త్రినాథరావు, చాగంటి రాజ్యలక్ష్మి, ఎం.ధనలక్ష్మి, విజయలక్ష్మి, కళావతి, అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.